క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు మాల్యవంతం విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

బత్తలపల్లి: రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు మాల్యవంతం ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెన్నకృష్ణారెడ్డి, పీడీ నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ అనంతపురం ఇండోర్ స్టేడియంలో బుధవారం జరిగిన జిమ్నాస్టిక్ పోటీల్లో తమ విద్యార్థులు నందనకుమారి, అశ్వని(8వ తరగతి), రాము(9వ తరగతి) అండర్-19 కేటగిరి విభాగంలో ప్రతిభ చాటడంతో నిర్వాహకులు వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారన్నారు. ఈసందర్భంగా హెచ్ఎం, పీడీ, ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ చైర్మన్ ఈశ్వర్‌నాయుడు విద్యార్థులను అభినందించారు.

క్రీడా దుస్తుల పంపిణీ



క్రీడాకారులకు దుస్తులు అందించిన దృశ్యం

కదిరి అర్బన్: ఉమ్మడి అనంపురం జిల్లా గోల్ షాట్ క్రీడాకారులకు శుక్రవారం ఎరుకులవాండ్లపల్లిలోని హరీష్ పాఠశాల ప్రిన్సిపాల్ ఎంఎస్ కిరణ్ క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. చిత్తూరు జిల్లా నేరేబైలులో శని, ఆదివారాల్లో జరిగే రాష్ట్రస్థాయి గోల్‌షాట్‌బాల్ పోటీలకు ఉమ్మడి అనంతపురం జిల్లా క్రీడాకారులు పాల్గొంటారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో గోల్‌షాట్ బాల్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రేపు కంటి వైద్య శిబిరం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం బెంగళూరులోని శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులతో కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు రోటరీక్లబ్ అధ్యక్షుడు నాగభూషణ, కోశాధికారి నరేంద్రరెడ్డి తెలిపారు. స్థానిక సాంస్కృతిక మండలిలో శుక్రవారం రోటరీక్లబ్ సభ్యులు కంటి వైద్య శిబిరం కరపత్రాలను విడుదల చేశారు. క్లబ్ సభ్యులు సోలిగాళ్ల వెంకటేషులు, సత్రసాల ప్రసన్నకుమార్, రమేష్ బాబు, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ఆటో, రేషన్‌బియ్యం

గాండ్లపెంట: ఎన్‌పీకుంట నుంచి కదిరికి ఆటోలో వెళుతున్న రేషన్ బియ్యాన్ని గాండ్లపెంట ఆర్ఐ జాఫర్ శుక్రవారం పట్టుకున్నారు. వివరాలు.. కదిరి అడపాలవీధికి చెందిన గంగులప్ప ఎన్‌పీకుంట మండలం ధనియానిచెరువు పరిసర గ్రామాల్లో ప్రజల వద్ద నుంచి రేషన్ బియ్యం కొనుగోలు చేసి ఆటోలో కదిరికి తరలిస్తున్నట్లు ఎన్‌పీకుంట రెవెన్యూ సిబ్బందికి సమాచారం అందింది. దీంతో వారు ధనియానిచెరువులో ఆటోను అడ్డగించా ఆపకుండా వచ్చేశాడు. ఈ విషయాన్ని ఎన్‌పీకుంట తహసీల్దార్ గాండ్లపెంట తహసీల్దార్‌కు తెలపడంతో ఆర్ఐను పంపి బియ్యంతో పాటు ఆటోను పట్టుకున్నారు. 350 కిలోలు ఉన్నా 7 బస్తాలను స్వాధీనం చేసుకుని బియ్యం, ఆటోను పోలీసులకు అప్పగించినట్లు తహసీల్దార్ బాబురావు చెప్పారు.

అనుమానితుల ఇళ్ల తనిఖీ

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఇందిరమ్మకాలనీ, కేతిరెడ్డికాలనీల్లో శుక్రవారం టూటౌన్ సీఐ రెడ్డెప్ప, సిబ్బందితో కలిసి అనుమానితులు, రౌడీషీటర్లు, కొత్త వ్యక్తుల ఇళ్లను తనిఖీలు చేశారు. కొత్త వ్యక్తులు బాడుగకు ఇల్లు ఇచ్చే సమయంలో వారి వివరాలు తనిఖీ చేసుకోవాలని సీఐ కాలనీవాసులకు సూచించారు.

ధర్మవరం రూరల్: గ్రామాల్లో ఎవరైనా అనుమానితులు సంచరిస్తున్నట్లయితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు గ్రామస్తులకు సూచించారు. శుక్రవారం సుబ్బారావుపేటలో తన సిబ్బందితో కలిసి ఫుట్ పెట్రోలింగ్ చేపట్టారు.

గుడులను కొల్లగొడుతున్నారు..!

- వరుస చోరీలకు పాల్పడుతున్న దుండగులు
- సీసీ కెమెరాలు లేని ఆలయాలే లక్ష్యం
- పోలీసులకు సవాల్‌గా మారిన వైనం..





నల్లచెరువు పోలీస్ స్టేషన్, కమ్మవారిపల్లిలోని అమ్మవారి ఆలయంలో హుండీని ధ్వంసం చేసిన దృశ్యం

నల్లచెరువు: మండలంలోని గుడులను కొల్లగొడుతున్నారు. ఆలయాలే లక్ష్యంగా వరుస చోరీలకు పాల్పడుతున్నారు. ఆలయ కమిటీల పర్యవేక్షణా లోపం, పోలీసుల నిఘా వైఫల్యం వెరసి చోరీల పెచ్చుమీరుతున్నాయి. సీసీ కెమెరాలు లేని ఆలయాలను ఎంచుకుని మరీ దుండగులు దొంగతనాలకు పాల్పడుతున్నారు. ప్రధానంగా గ్రామ శివార్లో ఉన్న గ్రామదేవతల ఆలయాలను లక్ష్యంగా మారాయి. ఆయా ఆలయాల్లో హుండీలను పగలగొట్టి నగదు, ఇతర విలువైన కానుకలను అపహరిస్తున్నారు. రాత్రి 12 గంటల నుంచి తెల్లవారుజాము 2 గంటల సమయాల్లో దొంగలు చోరీల పాల్పడుతున్నట్లు పోలీసు రికార్డులు చెబుతున్నాయి. చోరీలపై గ్రామస్తులు ఫిర్యాదుతో పోలీసులు కేసులు నమోదు చేయయడమే తప్పా దొంగల జాడను మాత్రం పట్టుకోలేకపోతున్నారు. కొన్ని నెలలుగా దొంతనాలు జరుగుతున్నా ఇప్పటి వరకూ పోలీసులు ఒక్కరిని కూడా అదుపులోకి తీసుకోకపోవడంపై ఆలయ కమిటటీ సభ్యులు, భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇటీవల జరిగిన కొన్ని ఘటనలు కొన్ని..



- ఆగస్టు 23న మండల కేంద్రంలోని గీతామందిరంలో ఆలయ తాళాలు పగలగొట్టి హుండీని ధ్వంసం చేసి అందులోని దాదాపు రూ.30 వేలకుపైగా నగదు, భక్తులు సమర్పించిన కానుకలు ఎత్తుకెళ్లారు. అదే రోజు సమీపంలోని మార్కండేయ స్వామి ఆలయంలోనూ చొరబడి హుండీల పగలగొట్టి రూ.20 వేల వరకూ నగదును దోచుకెళ్లారు.
- సెప్టెంబరు 1వ తేదీ అర్ధరాత్రి సమయంలో కమ్మవారిపల్లి సమీపంలోని గ్రామ దేవత అలయం తాళాలు ధ్వంసం చేసి ఆలయంలోని హుండీని దొంగలు ఎత్తుకెళ్లారు. హుండీలో దాదాపు రూ.60 వేలు పైగా ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.
- మే నెలలో యర్రగుంటపల్లిలోని వెంకట మల్లయ్య దంపతులు ఇంటిపై నిద్రిస్తుండగా ఇంటోకి చోరబడిన దుండగులు ఏకంగా ఇంట్లోని బీరువాను పొలాల్లోకి తీసుకెళ్లి ధ్వంసం చేసి అందులోని రూ.1.30 లక్షల నగదు, తులం బంగారం ఎత్తుకెళ్లారు.
- గతేడాది అక్టోబరు 18న దేవిరెడ్డిపల్లి సమీపంలోని యాతంబావి గంగమ్మ ఆలయంలో ఆలయం గేటు పగులగొట్టి అమ్మవారి రూ.2 లక్షలు విలువైన వెండి కిరీటాన్ని ఎత్తుకెళ్లేందుకు దొంగలు యత్నించారు. గుడిలోని నంది విగ్రహాన్ని సైతం ధ్వంసం చేశారు. అయితే గుడి నుంచి శబ్దాలు రావడంతో స్థానికులు గమనించి కేకలు వేశారు. అమ్మవారి కిరీటాన్ని అక్కడే వదిలేసి తమ వెంట తెచ్చుకున్న సుమోతో దొంగలు పరారయ్యారు.
- కె.పూలకుంట రోడ్డు సమీపంలో నిర్మాణంలో ఉన్న చర్చి భవనం తలుపులు పగులగొట్టి అందులోని రూ.50వేలకు పైగా విలువ చేసే కరెంట్ సామగ్రిని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు.
- స్థానిక సచివాలయం-2 కార్యాలయ భవనంలో విలువైన కంప్యూటర్లు వంటి వస్తువులను ఎత్తుకెళ్లేదుకు దుండగులు మెయిన్ డోర్‌ను ధ్వంసం చేస్తుండగా స్థానికులు రావడంలో దుండగులు పరుగులు తీశారు.

చోరీల కట్టడికి చర్యలు



మండల కేంద్రంతో పాటూ గ్రామాల్లో సైతం రాత్రి సమయాల్లో పోలీసుల నిఘా పెంచాం. గ్రామాల్లో పర్యటించి ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఆలయ కమిటీ సభ్యులతో మాట్లాడి ఆలయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం.

– మక్బూల్ బాషా, ఎస్ఐ, నల్లచెరువు మండలం

బాలికలు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

కదిరి అర్బన్: అవకాశాలు అందిపుచ్చుకున్నప్పుడే బాలికలు అన్ని రంగాల్లో రాణిస్తారని ఆర్డీఓ వీవీఎస్ శర్మ పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ గర్ల్స్ హైస్కూల్‌లో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఆర్డీఓతో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ దిల్షాదున్నీషా హాజరయ్యారు. అనంతరం పాఠశాలల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

తాడిమర్రి: స్థానిక కేజీబీవీలో ప్రిన్సిపాల్ వాణిశ్రీ అధ్యక్షతన శుక్రవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించగా విజేతలకు తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకటరంగారావు బహుమతులు ప్రదానం చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలితమ్మ, ఎంఈఓ కృష్ణమోహన్ పాల్గొన్నారు.

బత్తలపల్లి: స్థానిక బాలికోన్నత పాఠశాలలో ఐసీడీఎస్ సీడీపీఓ సరస్వతి అధ్యక్షతన అంతర్జాతీయ బాలికల దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులకు పోటీలు నిర్వహించి విజేతలకు జెడ్పీటీసీ సుధ, మండల స్పెషల్ ఆఫీసర్ కృష్ణారెడ్డి, ఎంపీడీఓ నరసింహనాయుడు, తహసీల్దార్ స్వర్ణలత, బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం జయంతి చేతుల మీదుగా బహుమతులు అందించారు. డీటీ శారద, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు దేవమణి, ఎర్రమ్మ పాల్గొన్నారు.

గాండ్లపెంట: స్థానిక ఉన్నత పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. సర్పంచ్ రహంతుల్లా, మండల ప్రత్యేకాధికారి మోహన్‌రామ్, ఎంపీడీఓ సునిత, ఎంఈఓలు క్రిష్ణానాయక్, శ్రీనివాసులు, సూపర్ వైజర్ పద్మావతమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నల్లచెరువు: స్థానిక జెడ్పీహైస్కూల్‌లో అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. సీడీపీఓ వెంటలక్ష్మి, డీటీ రవి నాయక్, ఎంపీడీఓ రామక్రిష్ణ, ఎంఈఓలు తిరుపాల్ నాయక్, చెన్నకేశవులు, సర్పంచ్ పంచరత్నమ్మ పాల్గొన్నారు.

తనకల్లు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా శుక్రవారం విద్యార్థినులకు బహుమతులను అందజేశారు. తహసీల్దార్ సయ్యద్‌షాబుద్దీన్, ఎంపీడీఓ రామానాయక్, ఎంఈఓలు లలితమ్మ, కళ్యాణీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ పాల్గొన్నారు.



కదిరిలో మాట్లాడుతున్న ఆర్డీఓ వీవీఎస్ శర్మ

పుట్టపర్తి టౌన్: బుక్కపట్నం కేజీబీవీలో ఐసీడీఎస్, రెవెన్యూ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో విద్యార్థులకు పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎస్ఐ కృష్ణమూర్తి, ఎంఈఓ గోపాల్‌నాయక్ సూపర్‌వైజర్ పుష్పలత, ఎస్ఓ సౌజన్య చట్టాలపై అవగాహన కల్పించారు.

ముదిగుబ్బ: మండల కేంద్రంలో శుక్రవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంపీపీ ఆదినారాయణ హెచ్ఎం రమాదేవి, ఏపీఎం హేమలత, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓడీచెరువు: స్థానిక చౌడేశ్వరి దేవి కళ్యాణ మండపంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గంగాదేవి ఆధ్వర్యంలో బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర్ రెడ్డి, జెడ్పీటీసీ కవితా శివశంకర్‌రెడ్డి, తహసీల్దార్ రామనాథరెడ్డి, ఎంపీడీఓ మునెప్ప హాజరయ్యారు.

ధర్మవరం: మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ సాయిప్రకాష్, స్పెషల్ ఆఫీసర్ నరసింహమూర్తి, ఎంఈఓ గోపాల్‌నాయక్, రాజేశ్వరి, సీడీపీఓ లక్ష్మి, బీజేపీ ఇన్‌చార్జ్ హరీష్‌బాబు హాజరయ్యారు.

చెన్నేకొత్తపల్లి/కనగానపల్లి/రామగిరి: అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి, రామగిరిలో ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. చెన్నేకొత్తపల్లిలో ఎమ్మెల్యే పరిటాల సునీతతో పాటు, ధర్మవరం ఆర్డీఓ మహేష్, తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీడీఓ బాలకృష్ణుడు, సీడీపీఓ కవితాదేవి కనగానపల్లిలో మండల ప్రత్యేకాధికారి, శిశు సంక్షేమశాఖ పీడీ ప్రమీల, ఎంఈఓ శ్రీదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రశాంతి, హెల్త్ సూపర్ వైజర్ శ్రీనివాసులు, రామగిరిలో తహసీల్దార్ రవికుమార్, ప్రిన్సిపాల్ సౌమ్యలత తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేద్దాం



తాడిమర్రిలో అగిలే శంకర్‌రెడ్డికి శాలువా కప్పి సన్మానిస్తున్న నాయకులు, కార్యకర్తలు



లింగాల శివశంకర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

తాడిమర్రి: మండలంలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేద్దామని ఆ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అగిలే శంకర్‌రెడ్డి కార్యకర్తలకు సూచించారు. మండలంలోని మర్రిమాకులపల్లి, మద్దులచెర్వు తదితర గ్రామాలకు చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం మండల కేంద్రంలో శంకర్‌రెడ్డికి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం పని చేసిన నాయకులు, కార్యకర్తలు అందరికి అధిష్టానం తగిన గుర్తింపు ఇస్తుందన్నారు. తనపై నమ్మకంతో రాష్ట్ర కమిటీలో చోటు కల్పించిన అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, సహకరించిన మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు మీసాల కేశవరెడ్డి, ఊటుకూరు రవీంద్రారెడ్డి, ఊటుకూరు రమణారెడ్డి, ఆటో పీరా, బాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

కదిరి అర్బన్: వైఎస్సార్‌సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా(ఎస్ఈసీ) నియమితులైన లింగాల శివశంకర్‌రెడ్డిని కదిరి మండల నాయకులు కేఎస్‌పాళెంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ మణికంఠనాయక్‌తో పాటు పలువురు సర్పంచ్‌లు, అనుబంధ విభాగాల సభ్యులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు

పుట్టపర్తి టౌన్: రాష్ట్రంలో పేదల కోసం గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేసే నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం విరమించుకోకపోతే ప్రజాగ్రహానికి గురికావాల్సి వస్తుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పేరూరు కురుబ నాగిరెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని పేద, బడుగు, బలహీన వర్గాల వైద్య సేవల నిమిత్తం దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రీ తీసుకురాని విధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కళాశాలలను తీసుకొచ్చారని గుర్తు చేశారు. చంద్రబాబుకు పేద ప్రజలు బాగుపడడం ఇష్టం లేకనే వైద్య విద్యను నీరుగార్చి భ్రష్టు పట్టించాలని చూస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. ఇప్పటికైనా ప్రైవేటీకరణ అంశాన్ని విరమించుకోకపోతే ప్రజలు గట్టి గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

యువత క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలి

ధర్మవరం అర్బన్: యువత క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ, మై భారత్ అనంతపురం ప్రగతి పథం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్లస్టర్ లెవెల్ స్పోర్ట్స్ మీట్‌ను నిర్వహించారు. ప్రిన్సిపాల్ సురేష్‌బాబు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత జయమారుతి, పీడీ ప్రదీప్, అధ్యాపకులు రాజేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మల్లికార్జున హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల ద్వారానే మానసిక శారీరక ఆరోగ్య లభిస్తుందన్నారు. అనంతరం క్రీడలలో గెలుపొందిన యువతకు కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ప్రశంసాపత్రాలు, మెడల్స్, ట్రోఫీలను అందించారు. ప్రగతి పథం యూత్ అసోసియేషన్ సభ్యులు గోపి, అధ్యాపకులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు, అసోసియేషన్ సభ్యులు

బోధనేతర కార్యక్రమాల బహిష్కరణ

ఎన్‌పీకుంట: బోధనేతర కార్యక్రమాలను శుక్రవారం నుంచి బహిష్కరిస్తున్నట్లు ఫ్యాప్టో నాయకులు ఎంఈఓ గోపాల్‌నాయక్‌కు శుక్రవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో జిల్లా అధ్యక్షుడు జి.హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ బోధనేతర కార్యక్రమాలతో బోధనా సమయం తగ్గి విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. పాఠశాలల ప్రారంభం నుంచి యోగాంధ్ర, మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్, మొక్కల పెంపకం, విద్యార్థుల వివరాల ఆన్‌లైన్, విద్యా కానుక కిట్ల పంపిణీతో పాటు రోజుకు ఒక నివేదిక గూగుల్ షీట్, ఆన్‌లైన్ పనులు చేసి ఎంఈఓ కార్యాలయానికి పంపించాల్సిన పరిస్థితి ఉందన్నారు. నాయకులు వెంకటరామిరెడ్డి, సందీప్, శంకర్, హబీబుల్లా, రమణయ్య, పాలికి రమేష్, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

కదిరి అర్బన్: ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 10 నుంచి బోధనేతర పనులను బహిష్కరిస్తున్నట్లు సంఘం నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం ఎంఈఓలు చెన్నక్రిష్ణ, ఓబుల్‌రెడ్డిలకు ఫ్యాప్టో నాయకులు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ బోధనేతర పనులు పెరిగిపోయాయని పలు దఫాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఫ్యాప్టో నాయకులు శ్రీనివాసులు, రామ్మోహన్, తాహిర్‌వలీ, చలం మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.




ఎన్‌పీకుంటలో ఎంఈఓ గోపాల్‌నాయక్‌కు వినతి పత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

గాండ్లపెంట: బోధనేతర పనులను చేయలేమని ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో శుక్రవారం ఎంఈఓ క్రిష్ణానాయక్, శ్రీనివాసులకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు జి.రామమోహన్. సి.తాహిర్‌వలీ, రమేష్‌బాబు, ఆసిఫ్, రమణనాయక్, చంద్రశేఖర్ జయరాం, ప్రసాద్ పాల్గొన్నారు.

ఓడీచెరువు: బోధనేతర కార్యక్రమాలను శుక్రవారం బహిష్కరిస్తున్నట్లు ఫ్యాప్టో జిల్లా సెక్రటరీజనరల్ కట్టుబడి గౌస్ లాజమ్, ఉపాధ్యాయులు శుక్రవారం ఎంఈఓలు సురేష్ బాబు, రమణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు సోమశేఖర్ నాయక్, రాంకుమార్, మనోహర్, మధుసూదన్‌రెడ్డి, వెంకటాచలమయ్య, శ్రీనివాసులు, మహేందర్‌రెడ్డి, చంద్రమౌళి, నాగరాజు, ఓబుళేసు, ఈశ్వరయ్య, సుధాకర్ పాల్గొన్నారు

పూర్వ విద్యార్థుల వితరణ

ధర్మవరం: పట్టణంలోని బీఎస్ఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలకు 1993-94 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు శుక్రవారం రూ.20 వేలు వితరణగా అందించారు. పూర్వ విద్యార్థులు ఇంటర్నెట్, ఐఎఫ్‌పీ ప్యానల్స్ కోసం రూ.20 వేలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు జ్యోతి, ఉపాధ్యాయులు ప్రకాష్, పీఈటీ లక్ష్మినారాయణలకు అందించారు. పూర్వ విద్యార్థులు సంద్ర రామకృష్ణ, శ్రీనివాసులు, శీబా సురేష్‌గుప్త, సిరివెళ్ల ఆంజనేయులు, బీరే నాగేశ్వరరావు, పామిశెట్టి లక్ష్మినారాయణ, వజ్జల సంపత్, నరసింహులు, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల హెచ్ఎంకు నగదు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

సీసీ కెమెరాల ఏర్పాటు



సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి మండలం పెడపల్లి బస్టాండులో కిందపడిన సీసీ కెమెరాలను పోలీసులు యథాస్థానంలో ఏర్పాటు చేశారు. నిఘా నేత్రాలపై నిర్లక్ష్యమేలా? శీర్షికన శుక్రవారం సాక్షిలో కథనం ప్రచురింమైంది. దీంతో స్పందించిన రూరల్ పోలీసులు యథావిధిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

నల్లమాడ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా విద్యాధికారి, మండల ప్రత్యేకాధికారి జి. క్రిష్టప్ప ఎస్టీ ఆశ్రమ పాఠశాల సిబ్బందిని ఆదేశించారు. మండల కేంద్రంలోని పాఠశాలను శుక్రవారం ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంఈఓ వేమనారాయణతో కలిసి డీఈఓ తనిఖీ చేశారు. తరగతి గదులు, వంట గదులు, మరుగుదొడ్లను పరిశీలించారు. మరుగుదొడ్లలో నీటి లీకేజీని అరికట్టి శుభ్రంగా ఉంచాలని, డార్మెంటరీకి మెస్ వేయించాలని హెచ్ఎం సతీష్‌కు సూచించారు. అనంతరం స్థానిక జెడ్పీహైస్కూల్‌లో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వ్యాసరచన పోటీలో విజేతలకు డీఈఓ బహుమతులు ప్రదానం చేశారు. ముందుగా డీఈఓ రెడ్డిపల్లిలోని హౌసింగ్ లేఔట్‌ను పరిశీలించారు. ఈఓఆర్డీ అమర్నాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ధర్మవరం: సచివాలయ ఉద్యోగులు సమస్యలు తీర్చాలని ఏపీ విలేజ్ వార్డు సెక్రటేరియట్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ మహబూబ్ బాషా కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ అధికారిని కలిసి సమస్యలపై విన్నవించారు. మూడునెలలుగా ఇంక్రిమెంట్లు పెండింగ్‌లో ఉన్నాయని, బదిలీపై వచ్చిన ఉద్యోగుల పెండింగ్ జీతాలు చెల్లించాలని, అరియర్ బిల్లులు, మెడికల్ రియంబర్స్‌మెంట్ బిల్లులు ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు.

వర్షానికి కూలిన పాత ఇల్లు

నల్లచెరువు: మారిశెట్టిపల్లిలో గురువారం రాత్రి ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి పాత ఇల్లు కుప్పకూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. అయితే ఇంట్లో ఉంచిన పైపులు. మోటార్లు డ్రిప్ వంటి వ్యవసాయ పనిముట్లు ధ్వంసమయ్యాయి. సుమారు రూ.2 లక్షలు మేర నష్టం వాటిల్లిందని బాధిత మహిళా రైతు నాగరత్న తెలిపారు.

ఎన్టీఆర్ వైద్యసేవలు బంద్

ధర్మవరం అర్బన్: ఎన్టీఆర్ వైద్య సేవ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో శుక్రవారం నుంచి వైద్యసేవలు బంద్ చేశారు. ఎన్టీఆర్ వైద్యసేవ కింద ఒక్కో ఆసుపత్రికి దాదాపు రూ.కోట్లలో బిల్లులు చెల్లించాలని ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా స్పందించలేదని ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ ఆసుపత్రుల అసోసియేషన్ సభ్యులు తెలిపారు. పట్టణంలోని స్పందన ఆసుపత్రి, దేవి నర్సింగ్ హోమ్‌లో ఎన్టీఆర్ వైద్య సేవలు బంద్ అయ్యాయి.

నేత్రదానంతో ఇద్దరికి కంటిచూపు



నేత్రాలను అందిస్తున్న మృతురాలి కుటుంబసభ్యులు

ధర్మవరం అర్బన్: తన మరణానంతరం నేత్రదానంతో మరో ఇద్దరికి కంటి చూపును అందించారు ధర్మవరంలోని యాదవ వీధికి చెందిన గూడూరు సరోజమ్మ (80). వివరాలు.. వయో భారంతో శుక్రవారం సరోజమ్మ మృతి చెందారు. విషయం తెలుసుకున్న విశ్వదీప సేవా సంఘం వ్యవస్థాపకుడు కోళ్ల మొరం చంద్రశేఖర్‌రెడ్డి, సభ్యులు.. మృతురాలి కుటుంబసభ్యులను కలసి నేత్రదానం ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. వారు అంగీకరించడంతో సరోజమ్మ మృతదేహం నుంచి నేత్రాలను జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ డాక్టర్ కుళ్లాయప్ప, కంటి రెట్రావైల్ సెంటర్ టెక్నీషియన్ రాఘవేంద్ర సేకరించారు. నేత్రదానానికి సహకరించిన మృతురాలి కుమార్తెలు నాగవేణి, శ్రీదేవి, మంజుల, కుటుంబ సభ్యులు కై లాష్, స్నేహదీపిక, దీక్షిత, నిఖిల్, నిఖిలేశ్వర్‌కు విశ్వదీప సేవా సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షిప్త సమాచారం..

హత్య కేసులో మరో ఇద్దరి అరెస్టు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఇందిరమ్మకాలనీలో గతనెల 12న సరస్వతి అనే మహిళ హత్య కేసులో మరో ఇద్దరు మహిళలను అరెస్టు చేసినట్లు టూ టౌన్ సీఐ రెడ్డెప్ప తెలిపారు. టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం సీఐ వివరాలు వెల్లడించారు. ఇందిరమ్మకాలనీకి చెందిన సరస్వతిని రెండు నెలల క్రితం హత్య చేసి పూడ్చేసిన ఘటన గత నెల 12న బయటపడింది. ఈ హత్య కేసులో గత నెల 14న కేసు నమోదు చేసి నలుగురు నిందితులను అరెస్టు చేశామన్నారు. కేసులో ఇంకా పరారీలో ఉన్న ఆదిలక్ష్మి, వెంకటలక్ష్మిని అరెస్టు చేశామన్నారు. ఇంకా ఒకరు పరారీలో ఉన్నారని వారిని త్వరలో అరెస్టు చేస్తామని సీఐ తెలిపారు.

శ్మశానానికి స్థలం కేటాయించాలి

కదిరి టౌన్: కుటాగుళ్లలో ఎస్సీకాలనీకి సంబంధించి శ్మశానానికి స్థలం కేటాయించాలని కాలనీవాసులు శుక్రవారం తహసీల్దార్ మురళీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. గత 30 ఏళ్లుగా గుర్రాలంక వద్దనున్న శ్మశాన వాటికలో మృతదేహాలను ఖననం చేస్తున్నామన్నారు. అయితే ఇటీవల కొంతమంది తమకు పట్టా ఉందంటూ కంచె వేస్తున్నారన్నారు. ఆ స్థలాన్ని శ్మశానానికి కేటాయించాలని కోరారు.

రాయల వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలి

పుట్టపర్తి టౌన్: ఈనెల 17న శ్రీకృష్ణదేవరాయల వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బలిజ సంఘం నాయకులు డీఆర్ఓ సూర్యనారాయణరెడ్డిని కోరారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో డీఆర్ఓకు వినతపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాయలసీమ బలిజ సంఘం ఉపాధ్యక్షుడు చింతా దామోదర్, నాయకులు ముత్యాలు, మారుతి ప్రసాద్, అల్లాడి జయరాం, సంగాశ్రీనివాసులు, కరుణాకర్, ఆంజనేయులు, సతీష్, రఘుపతి, మల్లికార్జున, మైలేశంకర్, వెంకటేష్, సుబ్బరాము తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

తాడిమర్రి: మండల కేంద్రం సమీపంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన పెద్దకోట్లకు చెందిన యువకుడు చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. వివరాలు..గ్రామానికి చెందిన మంజుల ప్రమీల కుమారుడు నాగరాజు (28) ఈనెల 8న బైక్‌పై తాడిమర్రికి వస్తూ కారు ఢీకొని గాయపడిన విషయం విదితమే. బాధితున్ని వెంటనే కుటుంబ సభ్యులు అనంతపురంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడే మృతి చెందాడు. మృతుడు అవివాహితుడు కాగా తల్లి ప్రమీల, తమ్ముడు ఉన్నారు.

నీట మునిగిన టమాట పంట

ధర్మవరం రూరల్: మండలంలో శుక్రవారం ఉదయం 5.6 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. పై తట్టు ప్రాంతంలో కురిసిన వర్షానికి చిత్రావతి నది ప్రవహించి ధర్మవరం చెరువులోకి పెద్ద ఎత్తున నీరు చేరింది. దీంతో ధర్మవరం చెరువు మరువ పారుతోంది. తుమ్మల గ్రామానికి చెందిన రైతు చంద్రశేఖర్‌రెడ్డికి చెందిన రెండు ఎకరాల్లో సాగు చేసిన టమాట తోటలోకి నీరు చేరింది.

రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి

పుట్టపర్తి అర్బన్: మల్బరీ సాగులో రసాయన ఎరువుల వినియోగం పూర్తిగా తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలని అనంతపురం ప్రాంతీయ పట్టు పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రమ్య పేర్కొన్నారు. శుక్రవారం బుక్కపట్నం మండలం బుచ్చయ్యగారిపల్లిలో 'నా పట్టు-నా అభిమానం పేరుతో పట్టు రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మల్బరీలో ట్రీ పద్ధతిలో సాగు చేస్తే ఆకుల నాణ్యత, దిగుబడి పెరుగుతుందన్నారు. సెరికల్చర్ ఏడీ అప్పలనాయుడు, ఏఎస్ఓ వేణుగోపాల్, టీఓలు బాబయ్య, ప్రభాకర్, రైతులు పాల్గొన్నారు.

బ్యాంక్ అధికారులకు నోటీసుల అందజేత

తనకల్లు: స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కొక్కంటిక్రాస్‌లో ఉన్న ఇండియన్ యూనియన్ బ్యాంక్, ఏపీజీబీ అధికారులకు ఎస్ఐ గోపి ఆధ్వర్యంలో శుక్రవారం నోటీసులను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ భద్రతా చర్యల్లో భాగంగా ఆయా బ్యాంకులలో చోరీలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. బ్యాంకులలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, అలారం సక్రమంగా పనిచేస్తున్నాయో లేదా అని రోజూ పరిశీలించాలని తెలిపారు. భద్రతా సిబ్బందిని నియమించుకోవాలని సూచించారు.